సాక్షి
పెద్దపల్లి

సోమవారం। 6। జనవరి। 2025

రైలెక్కిన యుద్ధ ట్యాంకులు

రామగుండం: కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వెళ్తున్న గూడ్సు క్యారియర్ యుద్ధ ట్యాంకులను తరలిస్తూ రామగుండం రైల్వేస్టేషన్‌కు చేరుకుంది. దీంతో ప్లాట్‌ఫారంపై ఉన్న ప్రయాణికులు ఈ రైలును ఆసక్తిగా తిలకించారు. ఈ అద్భుత దృశ్యం ఆదివారం 'సాక్షి' కెమెరాకు ఇలా చిక్కింది.



న్యూస్‌రీల్

నీరుకుల్లలో జడ్జి పూజలు



పూజలు చేస్తున్న జడ్జి అర్పిత

సుల్తానాబాద్‌రూరల్(పెద్దపల్లి): నీరుకుల్లలోని శ్రీమానేటి రంగనాయకస్వామి ఆలయంలో మంచిర్యాల జిల్లా జడ్జి అర్పిత ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ధనుర్మాసం సందర్భంగా స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ప్రధాన అర్చకులు గోవర్ధనగిరి మనోహరాచార్యులు, రాజ్‌కుమార్ ఆశీర్వచనలు ఇచ్చారు. ఎండోమెంట్ అధికారి శంకర్, క్లర్క్ ప్రవీణ్ తదితరులు జడ్జిని సన్మానించారు.

ఎల్‌వోసీ అందజేత



ఎల్‌వోసీ అందిస్తున్న విప్ లక్ష్మణ్‌కుమార్

ధర్మారం(ధర్మపురి): నర్సింహులపల్లికి చెందిన లైశెట్టి లక్ష్మీ వైద్యఖర్చుల కోసం ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్ ఆదివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాయంలో ఎల్‌వోసీ అందజేశారు. అనారోగ్య సమస్యతో లక్ష్మి హైదరాబాద్‌లోని నిమ్స్‌లో చికిత్స పొందుతోంది. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ లావుడ్య రూప్లా నాయక్, మాజీ చైర్మన్ కొత్త నర్సింహులు, నాయకుడు స్వామి తదితరులు పాల్గొన్నారు.

హెడ్ ఆఫ్ ప్రాజెక్టుగా చందన్



జ్యోతినగర్(రామగుండం): ఎన్టీపీసీ రామగుండం–తెలంగాణ ప్రాజెక్టు హెడ్ ఆఫ్ ప్రాజెక్టు(హెచ్‌వోపీ)గా చందన్ కుమార్ సామంత ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం పర్మినెంట్ టౌన్‌షిప్‌లోని హనుమాన్ ఆలయంలో పూజలు చేశారు. అధికారులతో కలిసి ప్రాజెక్టులోని సీహెచ్‌పీ, సైలో యాష్ డైక్, కంట్రోల్ రూమ్‌లు సందర్శించారు. ఇంజినీర్లతో విద్యుత్ ఉత్పత్తి తదితర అంశాలపై సమీక్షించారు.

'ఎల్లంపల్లి'లో 18.53 టీఎంసీలు



రామగుండం: ఎల్లంపల్లి ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 20.175 టీఎంసీలు కాగా ఆదివారం 18.53 టీఎంసీలు నిల్వ ఉందని నీటి పారుదల శాఖ అధికారులు తెలిపారు. ప్రాజెక్టులోకి ఇన్‌ఫ్లో లేదు. కానీ, ప్రాజెక్టు నుంచి 309 క్యూసెక్కులను హైదరాబాద్ మహానగర వాసుల కోసం పంపింగ్ చేస్తున్నారు.

ప్రతిభ చూపిన మాస్టర్ అథ్లెట్



రాధ

గోదావరిఖనిటౌన్: హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో నిర్వహిస్తున్న జాతీయస్థాయి మాస్టర్స్ అథ్లెటిక్ స్టేట్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో కాంటేవాడ రాధ(48) ప్రతిభ చూపారు. ఐదు కి.మీ. నడక పోటీ మహిళల విభాగంలో కాంస్య పతకం సాధించారు. యైటింక్లయిన్‌కాలనీకి చెందిన రాధ భర్త బుగ్గాజి ఓసీపీ–1లో ఉద్యోగి.

మల్లన్నకు బోనాలు



మల్లన్నకు మొక్కులు చెల్లిస్తున్న హిజ్రాలు

ఓదెల(పెద్దపల్లి): ఓదెల మల్లికార్జునస్వామి సన్నిధిలో ఆదివారం భక్తుల రద్దీ పెరిగింది. ఉత్తర తెలంగాణ జిల్లాలతోపాటు మహారాష్ట్ర నుంచి కూడా తరలివచ్చిన భక్తులు ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. మల్లికార్జునస్వామి, శ్రీసీతారామచంద్రస్వామి, ఖండేలరాయుడు, నందీశ్వరులను దర్శించుకున్నారు. పూజారులతో పట్నాలు వేయించారు. బోనాలతో నైవేద్యం సమర్పించారు. ఈవో సదయ్య ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ర్యాష్ డ్రైవింగ్ ప్రమాదం



5కే రన్‌లో సీపీ శ్రీనివాస్, అధికారులు

కోల్ సిటీ(రామగుండం): యువత తాత్కాలిక ఆనందం కోసం ర్యాష్ డ్రైవింగ్‌తో విలువైన ప్రాణాలు కోల్పోతోందని రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్ అన్నారు. ఆదివారం నగరంలో 5కే రన్ నిర్వహించారు. మద్యం తాగి డ్రైవింగ్ చేయొద్దని సూచించారు. గతేడాది నిబంధనలు ఉల్లంఘించిన వారికి రూ.13 కోట్ల వరకు జరిమానా విధించామని వెల్లడించారు.

తుది దశకు 'సర్వే'

- అత్యధికం అద్దె ఇళ్లు, రేకులే షెడ్లే
- గ్రామాల్లో 92.57 శాతం, పట్టణాల్లో 82.79 శాతం నమోదు
- మరోవారం రోజుల్లో ప్రక్రియ పూర్తి



ఎన్టీపీసీ ఇందిరమ్మ కాలనీలో చేపట్టిన సర్వేను తనిఖీ చేస్తున్న అదనపు కలెక్టర్ అరుణశ్రీ(ఫైల్)

సాక్షి, పెద్దపల్లి: సాంకేతిక సమస్యలు, యాప్‌లో వివరాల నమోదులో ఎదురయ్యే సవాళ్లతో సిబ్బంది తిప్పలు పడుతున్నా.. జిల్లాలో చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల సర్వే ఎట్టకేలకు తుదిదశకు చేరుకుంటోంది. సర్వర్ సమస్యతోపాటు దరఖాస్తుదారులు ఇళ్లలో అందుబాటులో లేకపోవడంతో తొలుత ఆశించిన స్థాయిలో సర్వే వేగంగా సాగలేదు. ప్రస్తుతం సర్వే ప్రక్రియ జోరందుకుంది. దరఖాస్తుదారుల వివరాలు నమోదు చేసేందుకు సంక్రాంతి పండుగ వరకు సర్వే ప్రక్రియ పూర్తిచేయాలని లక్ష్యంగా నిర్దేశించారు. అయితే, తొలిదశలో ఇళ్ల స్థలాలు ఉన్న దరఖాస్తుదారులకు నియోజకవర్గంలో 3,500 చొప్పున ఇళ్లు కేటాయిస్తారు. ఈమేరకు డిసెంబర్ 10 నుంచి గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు, మున్సిపాలిటీలు, రామగుండం కార్పొరేషన్‌లో వార్డు అధికారులు సర్వేలో పాల్గొంటున్నారు. ప్రజాపాలనలో అందిన దరఖాస్తుదారుల వివరాల ఆధారంగా ప్రభుత్వ సిబ్బంది క్షేత్రస్థాయిలో సర్వే చేస్తూ వివరాలు పరిశీలిస్తోంది. దరఖాస్తుదారు, స్థలం, దస్తావేజుల ఫొటోలు తీసి యాప్‌లో నమోదు చేస్తున్నారు. ఈ క్రమంలో ప్రజల నుంచి వారికి పలు సందేహాలు, ప్రశ్నలు ఎదురవుతున్నాయి.

సర్వేలో సందేహాలెన్నో..

- ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న కుటుంబ పెద్ద, ప్రస్తుతం చనిపోయిన సందర్భంలో సర్వే చేయడం సిబ్బందికి కష్టతరమవుతోంది.
- ప్రజాపాలన సందర్భంగా రేషన్‌కార్డు ఉన్నవారే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దీంతో చాలామంది పేదలు దరఖాస్తు చేసుకోలేకపోయారు. ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న వారి వివరాలపైనే సర్వే చేస్తుండంతో తమ పరిస్థితి ఏమిటని అని దరఖాస్తు చేసుకోని వారు సిబ్బందిని ప్రశ్నిస్తున్నారు.
- కొందరు తమకు ఉన్న స్థలంలో చిన్నపాటి రేకులు, ఇటుకలతో సగం ఇళ్లు నిర్మించుకున్నారు. వారు ఇందిరమ్మ ఇళ్లు మంజూరైతే వచ్చే రూ.5లక్షలతో ఇంటి నిర్మాణం పూర్తి చేసుకుంటామని అంటున్నారు.
- ఇంటి స్థలం, దస్తావేజులను సిబ్బంది ఫొటోలు తీసి యాప్‌లో నమోదు చేస్తుండగా, చాలామంది వద్ద అలాంటి ఆధారాలేమీ ఉండడంలేదు. ఇలాంటివారు తప్పని సరి పరిస్థితుల్లో తమకు స్థలం లేదని సర్వేకు వచ్చే సిబ్బందికి సమాధానం చెబుతున్నారు.

పైరవీలు షురూ..

మరోవారంలో సర్వే 100శాతం పూర్తిచేస్తామని అధికారులు అంటున్నారు. ఆ తర్వాత గ్రామసభలు ఏర్పాటు చేసి లబ్ధిదారుల జాబితా తయారు చేస్తారు. గ్రామసభల ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేసిన జాబితాను కలెక్టర్‌కు నివేదిస్తారు. కలెక్టర్ పరిశీలించాక ఇన్‌చార్జి మంత్రులు పరిశీలించి ఆమోదిస్తే.. లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో నగదును విడతల వారీగా జమచేస్తారు. అయితే, ఈ ప్రక్రియలో ఇందిరమ్మ ఇళ్ల కమిటీ సభ్యులు కీలకమని, కొందరు సభ్యులు సర్వే సిబ్బందిపై ఇప్పటికే పెత్తనం చెలాయిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. ఇదేసమయంలో ఇళ్లు ఇప్పిస్తామని ఇప్పటికే వసూళ్ల దందా షురూ చేశారని దరఖాస్తుదారులు వాపోతున్నారు.

గ్రామాల్లో 1,28,972 దరఖాస్తులు..

గ్రామాల్లో 1,28,972 మంది ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకోగా ఇప్పటివరకు 1,19,390 మంది వివరాలును సిబ్బంది సేకరించారు. 92.57శాతం సర్వే నమోదు పూర్తయింది. మున్సిపల్‌తోపాటు రామగుండం కార్పొరేషన్‌లో 1,62,226 మంది దరఖాస్తు చేయగా.. 89.79 శాతం సర్వే పూర్తిచేశారు. కాగా, 58,796 మంది రేకుల షెడ్లు, 32,412మంది పెంకుటిళ్లు, 3,316 మంది టార్పాలిన్ కవర్లు, 57,748 మంది అద్దె ఇళ్లు, 33,480మంది స్లాబ్, 79,506 మంది సొంత ఇళ్లలో ఉన్నట్లు సర్వే సిబ్బందికి తెలియజేశారు.

వారంరోజుల్లో పూర్తి

జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల సర్వే తుదిదశకు చేరుకుంది. గ్రామాల్లో 92 శాతం పూర్తయింది. స్థానికంగా అందుబాటులో లేని దరఖాస్తుదారులకు సమాచారం ఇచ్చాం. ఇలాంటి వారు స్వస్థలాలకు వస్తే వారంరోజుల్లో 100శాతం సర్వే పూర్తవుతుంది.

– అరుణశ్రీ, అదనపు కలెక్టర్

జిల్లాలో సర్వే తీరు ఇది

మండలం	దరఖాస్తులు	సర్వేచేసినవి	శాతం
కమాన్‌పూర్	6,311	5,306	84.08
రామగిరి	9,430	7,948	84.28
ఓదెల	11,452	9,873	86.21
శ్రీరాంపూర్	11,235	9,692	86.27
మంథని	12,731	11,660	91.59
పాలకుర్తి	9,361	8,588	91.74
ఎలిగేడు	5,499	5,144	93.54
జూలపల్లి	7,559	7,211	95.40
అంతర్గాం	6,032	5,756	95.42
పెద్దపల్లి	16,346	15,738	96.28
ధర్మారం	13,101	12,812	97.79
సుల్తానాబాద్	11,268	11,109	98.59
ముత్తారం	8,647	8,553	98.91
రామగుండం కార్పొరేషన్	35,066	27,582	78.66
పెద్దపల్లి మున్సిపల్	8,637	7,740	89.61
మంథని మున్సిపల్	3,980	3,627	91.13
సుల్తానాబాద్ మున్సిపల్	4,009	3,887	96.96

మిగిలింది మూడు నెలలే..

- ఇంకా సాధించాల్సిన బొగ్గు ఉత్పత్తి 23.25 మిలియన్ టన్నులు



డంపర్‌లో బొగ్గు లోడ్ చేస్తున్న షావల్

గోదావరిఖని: ఇంకా మిగిలింది మూడునెలలే.. ఉత్పత్తి చేయాల్సింది 23.25 మిలియన్ టన్నులు.. 9 నెలల్లో సింగరేణి బొగ్గు గనుల సంస్థ 46.75 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించింది. అయితే, ఓసీపీల్లో బొగ్గు ఉత్పత్తి ఆశాజనకంగా ఉన్నా.. భూగర్భగనుల్లో మెరుగుపడాల్సి ఉంది. సింగరేణి సీఎండీగా బాధ్యతలు చేపట్టిన బలరాం.. ఉత్పత్తి లక్ష్య సాధనపై ప్రత్యేక దృష్టి సారించారు. ప్రధానంగా లాభాల బాటలో కొనసాగుతున్న ఓసీపీల్లో ఉత్పత్తి పెరిగితేనే లాభాలు ఆర్జించేవీలు ఉందనే ఆలోచనతో ఓసీపీల్లో ఉత్పత్తిపై దృష్టి సారించారు. వర్షాకాలంలో ఉత్పత్తికి అంతరాయం కలుగడంతో ఉత్పత్తి కాస్త తగ్గింది. రాబోయే మూడునెలల్లో అత్యధిక బొగ్గు ఉత్పత్తి చేయాల్సి ఉండటంతో సింగరేణి యాజమాన్యం అప్రమత్తమైంది. మొత్తం 11ఏరియాల అధికారులతో సమీక్షిస్తోంది. నిర్దేశిత గడవులోగా మిలిగిన ఉత్పత్తి లక్ష్యం పూర్తిచేయాలనే పట్టుదలతో ముందుకు సాగుతోంది. అయితే, బొగ్గు గనులపై రక్షణ వారోత్సవాలు, మల్టీడిపార్ట్‌మెంటల్ కమిటీల పర్యటనలు కూడా ఉత్పత్తిపై ప్రతికూల ప్రభావం చూపాయని అంటున్నారు. అయినా, గతనెలతో పోల్చితే డిసెంబరులో రెండుశాతం అదనంగా బొగ్గు ఉత్పత్తి సాధించారు.

కాన్ఫరెన్స్‌లు.. పర్యటనలు

రాబోయే మూడు నెలల్లో బొగ్గు ఉత్పత్తి సాధనకు యాజమాన్యం ప్రణాళిక బద్ధంగా ముందుకెళ్తోంది. అన్ని ఏరియాల అధికారులతో సీఎండీ బలరాం నిత్యం వీడియోకాన్ఫరెన్స్ ద్వారా సమీక్షిస్తున్నారు. డైరెక్టర్లు ఆయా ఏరియాల్లో పర్యటిస్తూ ఉత్పత్తి లక్ష్య సాధన, వినియోగదారులకు అందించాల్సిన బొగ్గు తదితర అంశాలపై అధికారులు, ఉద్యోగులను అప్రమత్తం చేస్తున్నారు. ఓసీపీలపై పర్యటిస్తూ దిశానిర్దేశం చేస్తున్నారు.

బొగ్గు ఉత్పత్తి సమాచారం

2024–25 వార్షిక లక్ష్యం (మిలియన్ టన్నులు)	72
గత సెప్టెంబర్ వరకు లక్ష్యం(మిలియన్ టన్నులు)	50.61
సాధించింది(మిలియన్ టన్నులు)	46.75
సాధించిన శాతం	92
మొత్తం ఓసీపీలు	17
భూగర్భగనులు	22

గత డిసెంబర్ వరకు సంస్థ సాధించిన బొగ్గు ఉత్పత్తి(ఏరియాల వారీగా లక్షల టన్నుల్లో)

ఏరియా	లక్ష్యం	సాధించింది	శాతం
ఆర్జీ–1	36.56	32,98	90
ఆర్జీ–2	66.49	63.36	95
ఆర్జీ–3	45.10	44.09	98
ఏపీఏ	3.53	3.71	105
భూపాలపల్లి	32.73	24.10	74
కొత్తగూడెం	102.79	100.08	95
ఇల్లెందు	26.43	33.01	125
మణుగూరు	92.97	85.73	92
బెల్లంపల్లి	26.00	23.62	91
మందమర్రి	26.97	19.82	73
శ్రీరాంపూర్	46.49	36.31	78

లక్ష్య సాధనతోనే ఆర్థిక పరిపుష్టి



నిర్దేశిత బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని రక్షణతో పనిచేసి పూర్తిచేయాలి. పోటీ మార్కెట్‌లో నిలదొక్కుకునేందుకు తక్కువ వ్యయంతో ఎక్కువ ఉత్పత్తి సాధించాలి. ప్రధాన వనరులను వినియోగిస్తూ బొగ్గు ఉత్పత్తి పెంచాలి. అలాగే సోలార్, థర్మల్ పవర్ ఉత్పత్తి పెంచాలి. భారీయంత్రాల పనిగంటలు సద్వినియోగం చేసుకుంటే ఉత్పత్తి వ్యయం తగ్గుతుంది.

– బలరాం, సింగరేణి సీఎండీ

కార్మికుల సమస్యలు పరిష్కరించండి

- రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్



డైరెక్టర్ జాడ్లికి వినతిపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్

జ్యోతినగర్(రామగుండం): విద్యుత్ ఉత్పత్తిలో నిత్యం శ్రమించే కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ కోరారు. ఈమేరకు ఎన్టీపీసీ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఆసిఫ్ పాషాతోపాటు ఆదివారం న్యూఢిల్లీలో ఎన్టీపీసీ హెచ్‌ఆర్ డైరెక్టర్ అనిల్‌కుమార్ జాడ్లిని ఎమ్మెల్యే కలిసి వినతిపత్రం అందజేశారు. రామగుండం ప్రాజెక్టులో కాంట్రాక్టు కార్మికులు సమస్యలతో సతమతమవుతున్నారని ఆయన పేర్కొన్నారు. 65ఏళ్ల వయసు కలిగిన, ఫిట్‌నెస్ ఉన్న కార్మికులను విధులకు అనుమతించాలని, సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలు అందించాలని, కార్పొరేట్ తరహాలో ఇంగ్లిష్ మీడియంలో ఉచిత విద్య అందించాలని, కార్మికుల పిల్లలు, యువత, క్రీడాకారులకు అనువుగా ఉండేలా అన్ని సదుపాయాలతో స్టేడియం నిర్మించాలని కోరారు. హైటెన్షన్ టవర్ లైన్(టీజీ ట్రాన్స్‌కో)లను పూర్తిగా తొలిగించాలని, రాజీవ్ రహదారికి రెండు వైపులా సర్వీసు రోడ్డును తహసీల్దార్ కార్యాలయం వరకు పొడిగించాలని విన్నవించారు. హెచ్‌ఆర్ డైరెక్టర్ సానుకూలంగా స్పందించి సమస్యలను పరిష్కరించేందుకు హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే ఫోన్‌ద్వారా తెలిపారు.

పర్యాటక క్షేత్రంగా రామగిరి ఖిల్లా

- మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు



పరామర్శిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

రామగిరి(మంథని): రామగిరి ఖిల్లాను అంతర్జాతీయ స్థాయిలో పర్యాటక క్షేత్రంగా తీర్చిదిద్దుతామని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. బేగంపేటలో ఆదివారం కాంగ్రెస్ కార్యకర్తలతో ఆయన ముచ్చటించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. రామగిరి ఖిల్లా అభివృద్ధికి సీఎం రేవంత్‌రెడ్డితో రూ.ఐదు కోట్లు మంజూరు చేయించామని గుర్తుచేశారు. ఔషధ మొక్కల నిలయమైన ఖిల్లాను అన్నివిధాలా అభివృద్ధి చేస్తామన్నారు. నాయకులు చొప్పరి సదానందం, కల్వల శంకర్, సందెల కుమార్, దాసరి శివ, బర్ల శ్రీనివాస్, రాయమల్లు తదితరులు పాల్గొన్నారు. కాగా, ఆర్జీ–3 ఏరియా ఐఎన్‌టీయూసీ రూపొందించిన నూతన క్యాలెండర్‌ను మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఆవిష్కరించారు.

'కోలేటి' కుటుంబానికి పరామర్శ

కమాన్‌పూర్(మంథని): మాజీ ఎంపీపీ కోలేటి మారుతి తల్లి సుశీలమ్మ ఇటీవల మృతి చెందగా మంత్రి శ్రీధర్‌బాబు ఆమె కుటుంబసభ్యులను పరామర్శించారు. అనంతరం యువకుడు అన్వర్ చేసిన ఆత్మీయ సత్కారంలో పాల్గొన్నారు. కాగా, గుండారం రిజర్వాయర్‌ను మినీ ట్యాంక్ బండ్‌గా మార్చాలని మాజీ సర్పంచ్ ఓదెలు.. మంత్రికి విన్నవించారు.

ఓటరు జాబితా సవరించరా?



జాబితాలో శ్రీదేవసేన, వనజాదేవి పేర్లు

పెద్దపల్లిరూరల్: జిల్లా కలెక్టర్‌గా పనిచేసి బదిలీ పై వెళ్లిన శ్రీదేవసేన, ఉద్యోగ విరమణ పొందిన అడిషనల్ కలెక్టర్ వనజా దేవి పేర్లు ఇప్పటికీ ఓటరు జాబితాలోనే దర్శన మిస్తున్నాయి. బల్దియా లోని 10వ వార్డు ఓటరు జాబితాలో పేరుఉన్న శ్రీదేవసేన హైదరాబాద్‌కు బదిలీపై వెళ్లి సుమారు ఐదేళ్లు గడుస్తోంది. వనజాదేవి అప్పట్లోనే ఉద్యోగ విరమణ పొందారు. అయినా అధికారులు ఓటరు జాబితా నుంచి వారి పేర్లు తొలగించలేదు. కొందరు మరణించిన వారి పేర్లు కూడా జాబితాలో ఉన్నాయని, జాబితా తప్పుల తడకగా ఉందని పట్టణవాసులు అంటున్నారు.

విధుల బహిష్కరణ.. నిరసన

- సమ్మె విరమించి వెంటనే విధుల్లో చేరండి.. లేదంటే మిమ్మల్ని ఉద్యోగాల్లోంచి తొలగించి కొత్త వారిని నియమిస్తాం.

– సమగ్ర శిక్షా ఉద్యోగ సంఘాల నేతలకు ప్రభుత్వం హెచ్చరిక

- 27 రోజులుగా తెరుచుకోని భవిత సెంటర్లు
- మూతపడిన మండల విద్యావనరుల కేంద్రాలు
- సమ్మె విరమించకుంటే కఠినంగా వ్యవహరిస్తామంటున్న రాష్ట్రప్రభుత్వం
- ఉద్యోగాలను క్రమబద్ధీకరించాల్సిందేనంటున్న సమగ్ర శిక్షా ఉద్యోగులు



- ఇది పెద్దపల్లిలోని భవిత కేంద్రం. బుద్ధి మాంద్యం, మానసిక దివ్యాంగులకు సమగ్ర ఆటాపాటలతో అక్షరజ్ఞానం అందిస్తారు. ఇందులో పనిచేసే సమగ్ర శిక్షా ఉద్యోగుల సమ్మెతో ఇది 27 రోజులుగా తెరుచుకోవడం లేదు. దీంతో పిల్లలు తమ ఇళ్లకే పరిమితమయ్యారు. అలాగే మండల విద్యావనరుల కేంద్రం(ఎమ్మార్సీ) తలుపులు కూడా తెరచుకోవడం లేదు. విద్యాశాఖ కార్యకలాపాలు స్తంభించాయి.



కొండగట్టులో ఆదివారం ఎస్ఎస్ఏ ఆకారంలో మానవహారంగా ఏర్పడిన సమగ్ర శిక్షా ఉద్యోగులు



రోడ్డు ఊడ్చుతూ ఉద్యోగుల నిరసన(ఫైల్)

పెద్దపల్లిరూరల్: విద్యాశాఖలో సుమారు 16 ఏళ్లుగా కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ పద్ధతిన పనిచేస్తున్న తమ ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని సమగ్ర శిక్షా ఉద్యోగులు 27 రోజులుగా సమ్మె చేస్తున్నారు. వారు విధులు బహిష్కరించడంతో మండల విద్యావనరులు, భవిత కేంద్రాలు మూతపడ్డాయి. ఫలితంగా విద్యాశాఖ కార్యకలాపాలు స్తంభించాయి. ఉపాధ్యాయులు విద్యార్థులకు పాఠాలను బోధిస్తే.. తాము తక్కువ వేతనానికే అంతకన్నా ఎక్కువ పని చేస్తున్నా తమను చిన్నచూపు చూస్తున్నారని సమగ్ర శిక్షా ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నా పట్టించుకునే వారే కరువయ్యారు.

జిల్లాలో 428 మంది..

విద్యాశాఖలో జిల్లా, మండల, స్కూల్ కాంప్లెక్స్, పాఠశాల, కస్తూరిబా గాంధీ బాలికలు, యూఆర్ఎస్ స్థాయిలో సమగ్ర శిక్షా ఉద్యోగులు పనిచేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 19,600 మంది ఉద్యోగులు ఇలా వివిధ విభాగాల్లో పనిచేస్తున్నారు. ఇందులో జిల్లా విద్యాశాఖ కార్యాలయంతోపాటు జిల్లాలోని 14 మండలాల్లో 428 మంది ఉద్యోగులు విధులు నిర్వర్తిస్తున్నారు. కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ పద్ధతిన పనిచేస్తున్న ఉద్యోగులను ప్రతీ 11 నెలల తర్వాత వారంరోజులపాటు విధుల నుంచి తొలగిస్తారు. ఆ తర్వాత మళ్లీ నియామక ఉత్తర్వులు జారీచేస్తున్నారని ఉద్యోగులు వాపోతున్నారు. ఇందులో పనిచేసే వారికి నెలకు రూ.7,500 – రూ.32 వేల వరకు ప్రభుత్వం చెల్లిస్తోంది.

డిసెంబర్ 10 నుంచి సమ్మె..

సమగ్ర శిక్షా ఉద్యోగులు గతేడాది డిసెంబర్ 10వ తేదీ నుంచి సమ్మె చేస్తున్నారు. జిల్లా కేంద్రంలోని అమరవీరుల స్థూపం వద్ద దీక్ష శిబిరం ఏర్పాటు చేశారు. జిల్లాలోని ఉద్యోగులు అందరూ అక్కడకు చేరుకుని రోజుకో తీరు నిరసన చేపడుతున్నారు. సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తున్నారు. అయినా, సర్కార్ స్పందించకపోగా మరింత కఠినంగా వ్యవహరిస్తోందని సంకేతాలు వస్తున్నాయని ఉద్యోగులు వాపోతున్నారు.

న్యాయం చేయాలి..

బహిరంగ మార్కెట్‌లో నిత్యావసరాల ధరలకు అనుగుణంగా వేతనం పెరగక కుటుంబపోషణ భారంగా మారిందని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమకు ఉద్యోగభద్రత కరువైందన్నారు. తమ న్యాయమైన డిమాండ్లను సానుకూలంగా పరిశీలించాలని వేడుకుంటున్నారు. ఉద్యోగాలను రెగ్యులరైజ్ చేయాలని, అప్పటి వరకు పేస్కేల్ అమలు చేయాలని కోరుతున్నారు.

రెగ్యులరైజ్ చేయాలి



విద్యాశాఖలో వివిధ విభాగాల్లో పనిచేస్తున్న మా ఉద్యోగాలను రెగ్యులర్ చేయాలి. పనిభారం అధికంగా ఉంది. అయినా, మాకు అతి తక్కువ వేతనం చెల్లిస్తున్నారు. ప్రభుత్వమే చొరవచూపి మా న్యాయమైన డిమాండ్లను ఆమోదించాలి.

– తిరుపతి, ఉద్యోగ సంఘం జిల్లా అధ్యక్షుడు

కుటుంబ పోషణ భారం



సమగ్ర శిక్షా ఉద్యోగులుగా పనిచేస్తున్న మాకు ప్రభుత్వం అందిస్తున్న వేతనం కుటుంబపోషణకు సరిపోవడంలేదు. ఇతర సౌకర్యాలు, వసతులు, ప్రయోజనాలేవీ అందడంలేదు. అనూహ్యంగా అనారోగ్యం పాలైతే కోలుకోవడం కష్టం. ప్రభుత్వం మా విషయంలో సానుకూలంగా స్పందించాలి.

– మనోలత, ముత్తారం

ప్రభుత్వమే చొరవచూపాలి



సమగ్ర శిక్షా ఉద్యోగుల డిమాండ్ల ఆమోదానికి ప్రభుత్వమే చొరవ చూపాలి. ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలి. ప్రతీ ఉద్యోగికి బీమా, ఆరోగ్య బీమా సౌకర్యం వర్తింపజేయాలి. ఉద్యోగ విరమణ సందర్భంగా రూ.25 లక్షల వరకు ప్రయోజనాలు కల్పించాలి.

– కుంబాల సుధాకర్, రాష్ట్ర నేత

క్లుప్తంగా

లైంగికంగా వేధించిన వ్యక్తి రిమాండ్

వేములవాడ: లైంగికవాంఛ తీర్చాలని వెంటపడ్డ వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు వేములవాడటౌన్ సీఐ వీరప్రసాద్ తెలిపారు. వేములవాడ పట్టణానికి చెందిన ఓ మహిళ తన భర్తపై పెట్టిన కేసులో సహాయం చేస్తానని కోనరావుపేట మండలం మంగళంపల్లికి చెందిన మాజీ సర్పంచ్ ఉప్పుల శ్రీనివాస్ నమ్మించాడు. సదరు వివాహితతో తెల్లకాగితాలపై సంతకాలు తీసుకున్నాడు. కేసు విషయంలో పోలీసులకు, కోర్టుకు డబ్బులు ఇవ్వాలని వివాహిత వద్ద రూ.30వేలు తీసుకున్నాడు. అంతేకాకుండా లైంగికంగా వేదించడంతో ఆమె పోలీసులను ఆశ్రయించింది. ఎవరైనా ఇబ్బందులకు గురిచేస్తే పోలీసులను ఆశ్రయించాలని సీఐ కోరారు.

కిలో గంజాయి పట్టివేత

- నలుగురిపై కేసు నమోదు

పెగడపల్లి: మండలంలోని నర్సింహునిపేటలో నలుగురు వ్యక్తుల నుంచి కిలో గంజాయి స్వాధీనం చేసుకున్నామని ఎస్సై రవికిరణ్ తెలిపారు. పక్కా సమాచారం గ్రామ శివారులో దాడి చేయగా.. పెగడపల్లికి చెందిన ముగ్గురు, కొత్తపల్లికి చెందిన ఒకరు గంజాయితో పట్టుబడ్డారు. వారి నుంచి సుమారు రూ.25వేల విలువైన కిలో గంజాయి, మూడు సెల్‌ఫోన్లు, రెండు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వారితో సామాజిక సేవ

కోల్‌సిటీ(రామగుండం): గోదావరిఖనిలో డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన వారికి కోర్టు జరిమానా తోపాటు సామాజిక సేవ శిక్ష విధించింది. ఎన్టీపీసీ ఎస్సై ఉదయ్‌కిరణ్ ఆధ్వర్యంలో ఇటీవల డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు చేశారు. ఈసందర్భంగా 10 మంది మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడ్డారు. వారికి కౌన్సెలింగ్ ఇచ్చిన ఎస్సై.. ఆ తర్వాత గోదావరిఖని ప్రిన్సిపల్ మెజిస్ట్రేట్ వెంకట్ సచిన్‌రెడ్డి ఎదుట హాజరుపరిచారు. దీంతో వారికి జరిమానాతోపాటుగా గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి(జీజీహెచ్)లో పేషెంట్లకు పండ్లు పంపిణీ చేయాలని, ఆస్పత్రి ఆవరణ శుభ్రం చేయాలని మెజిస్ట్రేట్ ఆదేశించారు. ఈమేరకు ఆదివారం వారితో ఇన్ పేషెంట్లకు పండ్ల పంపిణీ చేశారు. ఆస్పత్రి ఆవరణను శుభ్రం చేయించారు.

ఎనిమిది మందిపై కేసు

జగిత్యాలక్రైం: ఎండపల్లి మండలం గుల్లకోట శివారు అటవీప్రాంతంలో కోడిపందాలు ఆడిన ఎనిమిది నిందితులను శనివారం రాత్రి జగిత్యాల సీసీఎస్ పోలీసులు పట్టుకున్నారు. వారి నుంచి రూ.4,750 నగదు, మూడు పందెంకోళ్లను స్వాధీనం చేసుకున్నామని వెల్గటూర్ ఎస్సై ఉమాసాగర్ తెలిపారు.

‘మోడల్’ స్కూల్స్ నోటిఫికేషన్

- ఈనెల 6 నుంచి ఫిబ్రవరి 28 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ
- ఏప్రిల్‌లో ప్రవేశ పరీక్ష
- ప్రతిభ, రిజర్వేషన్ ఆధారంగా ఎంపిక
- ఉమ్మడి జిల్లాలో 38 ఆదర్శ పాఠశాలలు



మోడల్ స్కూల్

కరీంనగర్: మోడల్ స్కూల్స్ నోటిఫికేషన్ వెలువడింది. 2025–26 విద్యా సంవత్సరానికి గాను ఆరో తరగతిలో ప్రవేశాలకు ఈనెల 6 నుంచి ఫిబ్రవరి 28 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తారు. ఏప్రిల్ 13న ఆయా పాఠశాలల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని, అలాగే మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు 7,8,9,10వ తరగతుల్లో మిగిలిన సీట్ల భర్తీకి ప్రవేశ పరీక్ష ఉంటుందని పాఠశాల విద్యాశాఖ అధికారులు పేర్కొన్నారు. పరీక్ష ఫీజు ఓసీలకు రూ.200, బీసీ, ఎస్సీ, ఎస్టీ, వికలాంగులు, ఈడబ్ల్యూఎస్ విద్యార్థులు రూ.125 చెల్లించాలి. మరిన్ని వివరాలు వెబ్‌సైట్ http:// telanganams. cgg. gov. in లో పొందవచ్చు. దరఖాస్తులను ఈనెల6 నుంచి వెబ్‌సైట్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

ఉమ్మడి జిల్లాలో 38 పాఠశాలలు

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 38 ఆదర్శ పాఠశాలలు ఉన్నాయి. కరీంనగర్ జిల్లాలో చొప్పదండి మండలం రుక్మాపూర్, కరీంనగర్ మండలం ఎలగందల్, మానకొండూర్ మండలం పోచంపల్లి, రామడుగు, వీణవంక, జమ్మికుంట మండలం టేకుర్తి, చిగురుమామిడి మండలం ముల్కనూర్, గంగాధర, శంకరపట్నం, తిమ్మాపూర్, సైదాపూర్‌లలో ఆదర్శ పాఠశాలలు ఉన్నాయి. ఒక్కో పాఠశాలలో 6వ తరగతిలో ప్రవేశం పొందేందుకు 100 సీట్లు ఉంటాయి. 7,8,9,10వ తరగతుల్లో ఖాళీలుగా ఉన్న సీట్లను భర్తీ చేయనున్నారు.

పరీక్ష విధానం

ఆరవ, మిగిలిన తరగతులకు ఏప్రిల్ 13న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారు. ఆరో తరగతి ప్రవేశ పరీక్షలో వంద మార్కులకు వంద ప్రశ్నలు ఉంటాయి. ప్రశ్నపత్రం తెలుగు, ఇంగ్లిష్ మీడియంలో ఉంటుంది. తెలుగు, గణితం, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్, ఆంగ్లం పాఠ్యాంశాల్లో ఒక్కోదాని నుంచి 25 ప్రశ్నలు వస్తాయి. ఏడు నుంచి పదో తరగతులకు గణితం, సామాన్య, సాంఘికశాస్త్రం, ఇంగ్లిష్ నుంచి వంద ప్రశ్నలుంటాయి. ఒక్కోదాని నుంచి 25 ప్రశ్నలు ఇస్తారు. రెండు గంటల పాటు ఆబ్జెక్టివ్ విధానంలో పరీక్ష నిర్వహిస్తారు.

బాలికలకు హాస్టల్ సౌకర్యం

ఆదర్శ పాఠశాలల్లో బాలికలకు హాస్టల్ సౌకర్యం ఉంది. 9,10 తరగతులతో పాటు ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం చదువుతున్న వంద మందికి విద్యార్థులకు మాత్రమే హాస్టల్ అవకాశం ఉంది. హాస్టల్‌కు కనీసం మూడు కిలోమీటర్ల నుంచి.. ఆపై దూరంగా ఉన్న విద్యార్థులు మాత్రమే అర్హులు.

సద్వినియోగం చేసుకోవాలి



ఆదర్శ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు ఎన్‌సీసీలో ప్రత్యేక శిక్షణ ఉంది. విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. ఇంటర్ విద్యార్థినులకు హాస్టల్ వసతి ఉంటుంది. నాణ్యమైన విద్యతో పాటు క్రమశిక్షణ, మెరుగైన ఫలితాలతో ముందుంజలో ఉన్న ఆదర్శ పాఠశాలల్లో పిల్ల లను చేర్పించేందుకు తల్లిదండ్రులు ఆసక్తిచూపాలి.

– జనార్దన్‌రావు, డీఈవో, కరీంనగర్

ఆలస్యంగా నడుస్తున్న రైళ్లు

- ఉత్తరాదిన పొగమంచు కారణం
- ఇబ్బంది పడుతున్న అయ్యప్ప స్వాములు


కేరళ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలు

రామగుండం: ఉత్తరాది రాష్ట్రాల్లో చలితీవ్రత పెరుగుతోంది. పొగమంచు కమ్మేస్తోంది. ఫలితంగా రైల్వే సిగ్నల్స్ కనిపించడంలేదు. దీంతో న్యూఢిల్లీ నుంచి బయలుదేరే సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు గంటల కొద్దీ ఆలస్యంగా నడుస్తున్నాయి. ఎంత ఆలస్యమంటే.. ఈరోజు రామగుండం చేరుకునే రైలు మరుసటి రోజు వరకు వస్తోంది. దీంతో శబరిమలైలోని అయ్యప్పస్వామి దర్శనానికి వెళ్తున్న మాలాధారణ స్వాములు, భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రధానంగా వారి టూర్ షెడ్యూల్ పూర్తిగా మారిపోతోంది. కేరళ ఎక్స్‌ప్రెస్ రైలు ఆలస్యంతో ఏకంగా దర్శనం షెడ్యూల్, టూర్ ప్రోగ్రాం పూర్తిగా మారిపోవడమే కాకుండా రిటర్న్ జర్నీ టికెట్ అప్పటికే కన్ఫమ్ చేసుకొని ఉండడంతో సమయం సరిపోయే అవకాశం ఉండదని భక్తులు వాపోతున్నారు. ఒకవేళ రిటర్న్ జర్నీ టికెట్ క్యాన్సల్ చేస్తే మళ్లీ టికెట్ లభించే అవకాశం ఉండకపోవచ్చంటున్నారు. దీంతో భక్తులు దిక్కుతోచని పరిస్థితిల్లో ఉన్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుంచి సుదూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు రామగుండం రైల్వేస్టేషన్ నుంచి రైళ్లలో ప్రయాణిస్తుంటారు. ఇందులో భాగంగా రామగుండం రైల్వేస్టేషన్‌కు ఆదివారం చేరుకునే సూపర్‌ఫాస్ట్ ఎక్స్ ప్రెస్ రైళ్లు గంటల కొద్దీ ఆలస్యంగా నడుస్తున్నాయి. ఇందులో కేరళ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలు సుమారు 12 గంటలు ఆలస్యంగా నడుస్తోంది.

ఆలస్యంగా నడుస్తున్న రైళ్ల వివరాలు..

- న్యూఢిల్లీ – త్రివేండ్రం : కేరళ ఎక్స్‌ప్రెస్ : నంబరు 12626– రామగుండంలో సాయంత్రం ఐదు గంటలకు రావాల్సి ఉంది. కానీ, 12 గంటలు ఆలస్యంగా.. మరుసటి రోజు వేకువజామున ఆరు గంటలకు వస్తుంది.
- న్యూఢిల్లీ – విశాఖపట్నం : ఏపీ ఎక్స్‌ప్రెస్ : నంబరు 20806 – మధ్యాహ్నం 3.50 గంటలకు రామగుండం రావాల్సి ఉంది. కానీ, మరుసటి రోజు వేకువజామున 4.10 గంటలకు వస్తుంది.
- న్యూఢిల్లీ – చెన్నై : జీటీ ఎక్స్‌ప్రెస్ : నంబరు 12616 – సాయంత్రం 4.10 గంటలకు రావాల్సి ఉంది. కానీ, మరుసటిరోజు వేకువజామున 2గంటలకు రానుంది.
- శ్రీమాతావైష్ణోదటీ – కాట్రా జమ్ముతావి – చెన్నై : అండమాన్ ఎక్స్‌ప్రెస్ : నంబరు 16032 – మధ్యాహ్నం 2.53 గంటలకు రామగుండం రావాల్సి ఉంది. కానీ, ఐదు గంటలు ఆలస్యంగా రాత్రి 7.35 గంటలకు చేరుకుంటుంది.

రాజన్న సేవలో రాష్ట్ర దేవాదాయశాఖ కమిషనర్


కోడెమొక్కు చెల్లించుకుంటున్న రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ శ్రీధర్ దంపతులు


రాజన్న ఆలయ అభివృద్ధిపై రాష్ట్ర దేవాదాయశాఖ కమిషనర్ శ్రీధర్‌తో చర్చిస్తున్న ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్

వేములవాడ: రాజన్నను రాష్ట్ర దేవాదాయశాఖ కమిషనర్ శ్రీధర్ దంపతులు ఆదివారం దర్శించుకున్నారు. అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. స్వామి వారికి పూజలు చేసి, కోడెమొక్కు చెల్లించుకున్నారు. కమిషనర్ దంపతులకు ఈవో వినోద్‌రెడ్డి శేషవస్త్రం కప్పి లడ్డూ ప్రసాదాలు అందజేశారు. ఈఈ రాజేశ్, డీఈ మహిపాల్‌రెడ్డి, ఏఈవో శ్రవణ్, పర్యవేక్షకులు తిరుపతిరావు, వెంకటప్రసాద్, ఇన్‌స్పెక్టర్ రాజేందర్, శ్రీకాంతాచారి, సింహాచారి పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధిపై విప్ చర్చలు

రాజన్న ఆలయ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, పెండింగ్ పనులు త్వరగా పూర్తిచేయాలని రాష్ట్ర దేవాదాయశాఖ కమిషనర్ శ్రీధర్‌ను కోరారు. ఆలయ అతిథిగృహంలో కలిసి గుడిలో చేపట్టాల్సిన పనులపై చర్చించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

- వెంకట్రావుపల్లి ప్రమాదంలో మూడోవ్యక్తి మృతి


అశోక్ (ఫైల్)

బోయినపల్లి(చొప్పదండి): బోయినపల్లి మండలం వెంకట్రావుపల్లి పరిసరాల్లో డిసెంబర్ 26న రోడ్డుపై నిలిపి ఉన్న లారీని కారు ఢీకొన్న సంఘటనలో గాయపడి చికిత్స పొందుతున్న రిటైర్డ్ ఉద్యోగి మాడిశెట్టి అశోక్(64) ఆదివారం మృతిచెందాడు. ఎస్సై పృథ్వీధర్‌గౌడ్ తెలిపిన వివరాలు. కరీంనగర్ జిల్లా ఎల్ఎండీ మహాత్మానగర్‌కు చెందిన పోలవేని గట్టుబాబు, పోలవేని మంగ, మాడిశెట్టి అశోక్, అహల్యలు వేములవాడలో ఓ శుభకార్యానికి హాజరై తిరిగి వెళ్తుండగా ప్రమాదం జరిగింది. ఈ సంఘటనలో పోలవేని మంగ(55) అక్కడికక్కడే మృతి చెందింది. తీవ్రంగా గాయపడ్డ పోలె గట్టుబాబు (61) చికిత్స పొందుతూ ఈనెల 1న మృతిచెందాడు. కాగా కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మరొకరు మాడిశెట్టి అశోక్(64) ఆదివారం మృతి చెందాడు. మృతుడికి భార్య అహల్య, ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు. ప్రమాదం జరిగిన కారులో ఉన్న నలుగురిలో ఇప్పటికే ముగ్గురు చనిపోయారు.

ఇల్లంతకుంట(మానకొండూర్): ఇల్లంతకుంట మండలం దాచారం గ్రామానికి చెందిన బత్తిని సాగర్ (22) వారం క్రితం ప్రమాదానికి గురై హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ ఆదివారం మరణించాడు. గ్రామస్తులు తెలిపిన వివరాలు. సాగర్ గజ్వేల్ పట్టణంలో ఏసీ టెక్నీషియన్‌గా పనిచేస్తున్నాడు. వారం క్రితం పనులు ముగించుకొని సొంతూరు దాచారం బైక్‌ప వస్తుండగా కుక్క అడ్డు రావడంతో రోడ్డుపై పడిపోయాడు. తీవ్రంగా గాయపడ్డ సాగర్‌ను హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం చనిపోయినట్లు గ్రామస్తులు తెలిపారు.


సాగర్ (ఫైల్)

చికిత్స పొందుతూ వృద్ధురాలు..

హుజూరాబాద్: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వృద్ధురాలు చికిత్స పొందుతూ మృతిచెందింది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. శంకరపట్నం మండలం కల్వల గ్రామానికి చెందిన గాజుల ఓదమ్మ (68) శనివారం హుజూరాబాద్ మండలం జూపాక గ్రామంలో అంత్యక్రియలకు హాజరయింది. అనంతరం ఇంటికి వెళ్లేందుకు జూపాక క్రాస్ రోడ్డు వద్దకు చేరుకుంది. ఈ క్రమంలో శంకరపట్నం మండలం మొలంగూరు గ్రామానికి చెందిన ఖాజా కలీం కారును వేగంగా నడుపుకుంటూ వచ్చి ఓదమ్మను ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. 108లో హుజూరాబాద్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎంకు తరలించగా చికిత్స పొందుతూ రాత్రి మృతిచెందింది. మృతురాలి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తిరుమల్‌గౌడ్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి


సంఘటన స్థలంలో క్షతగాత్రులు

జమ్మికుంట(హుజూరాబాద్): కారు, ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టిన ఘటనలో ఒకరు మృతిచెందగా, మరొకరికి తీవ్రగాయాలయ్యాయి. టౌన్ సీఐ రవి తెలిపిన వివరాలు.. కమలాపూర్ మండలం గుండెటికి చెందిన గుడికందుల సంపత్ (55) జమ్మికుంట పట్టణంలోని మారుతీనగర్‌లో నివాసం ఉంటున్నాడు. ఇదే మండలంలోని పెద్దంపల్లికి చెందిన దొడ్డె రాజయ్య, సంపత్ మేస్త్రీ పని చేస్తారు. ఆదివారం పని నిమిత్తం ఇద్దరు ద్విచక్రవాహనంపై వెళ్తూ పట్టణంలోని ఓ బార్ సమీపంలో యూటర్న్ తీసుకుంటుండగా హుజూరాబాద్ నుంచి జమ్మికుంటకు వస్తున్న పట్టణంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రి వైద్యులకు చెందిన కారు అతి వేగంగా వచ్చి ఢీకొట్టింది. సంపత్ తలకు తీవ్రగాయాలవగా, రాజయ్య కాలు విరిగింది. వారిని 108లో హుజూరాబాద్ ఏరియా ఆసుపత్రి తరలించారు. మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎంకు తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ సంపత్ మృతిచెందాడు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. కారు డ్రైవర్ వినీల్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మృతుడి కుమారుడు శ్రవణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు.


సంపత్ (ఫైల్)

రిటైర్డ్ ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం


ఆత్మీయ సమ్మేళనంలో విశ్రాంత ఉద్యోగులు

కొత్తపల్లి(కరీంనగర్)/కరీంనగర్‌టౌన్: : కరీంనగర్ రేకుర్తిలోని సాయిమహాలక్ష్మీ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం ఉమ్మడి కరీంనగర్ జిల్లా చిన్న నీటిపారుదల శాఖ విశ్రాంత ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. విశ్రాంత జూనియర్ అసిస్టెంట్ ఎస్.రాజిరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన సమ్మేళనంలో విశ్రాంత ఇంజినీర్లు కె.కృష్ణమూర్తి, నల్ల వెంకటేశ్వర్లు, డి.తులసీదాస్, టీఎస్ఆర్ గుప్తా, విశ్రాంత పర్యవేక్షకులు కె.సురేశ్‌బాబు, ఎంఏ రషీద్, ఎస్.రాజమల్లయ్య, బి.వెంకటయ్య, ఎ.రాజలింగం, సీనియర్ అసిస్టెంట్లు ఎం.బాలకిషన్‌రావు, మోహన్‌రెడ్డి, జూనియర్ అసిస్టెంట్లు, నాల్గో తరగతి ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొని వారి ఉద్యోగ అనుభవాలను నెమరేసుకున్నారు. విశ్రాంత ఉద్యోగుల సొసైటీగా ఏర్పడి సమాజానికి అవసరమైన కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించారు.

ఆర్థిక వ్యవస్థను మెరుగు పర్చుతున్నాం


పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం మైదంబండ గ్రామంలో మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు

- కేటీఆర్ రాజీనామా ఆయన వ్యక్తిగతం
- ఐటీ, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

ముత్తారం(మంథని): బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో భ్రష్టుపట్టిన ఆర్థిక వ్యవస్థను తమ కాంగ్రెస్ ప్రభుత్వం మెరుగుపర్చుతోందని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. ఇటీవల మృతి చెందిన కాంగ్రెస్ నాయకులు పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం మచ్చుపేటకు చెందిన దుండే రాజేశం, మైదంబండకు చెందిన బియ్యని ఎల్లం కుటుంబాలను మంత్రి ఆదివారం పరామర్శించారు. అనంతరం మంత్రి మైదంబండలో విలేకరులతో మాట్లాడారు. ఆర్థిక క్రమశిక్షణ, అభివృద్ధి, సంక్షేమ ఫలాలు పేదలకు అందించేందుకు ప్రభుత్వం పనిచేస్తోందనన్నారు. వేలాది మంది కొత్త దంపతులకు బీఆర్ఎస్ ప్రభుత్వం ఒక్క రేషన్‌కార్డు ఇవ్వలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం కొత్తరేషన్ కార్డులు ఇస్తుందని తెలిపారు. మంథని మండలం గంగాపురి నుంచి ముత్తారం మండలం ఓడేడ్ వరకు రూ.60 కోట్ల వ్యయంతో ఆర్ అండ్ బీ ఆధ్వర్యంలో చేపట్టిన డబుల్ రోడ్డు పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని అధికారులను ఆదేశించారు. గాలికి కూలిన ఓడేడ్ వంతెన నిర్మాణానికి టెండర్లు పూర్తిచేశామని, పనులు సాగుతున్నయని అన్నారు. బీఆర్ఎస్ పాలనలో నాసిరకం పనులు చేయడంతోనే కాళేశ్వరం ప్రాజెక్టు, ఓడేడ్ వంతెన గడ్డర్లు గాలికి కూలయని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు చొప్పరి సదానందం, మండల అధ్యక్షుడు దొడ్డ బాలాజీ, మహిళా విభాగం అధ్యక్షురాలు గోవిందుల పద్మ, నాయకులు మద్దెల రాజయ్య, తూటి రఫీ, గాదం శ్రీనివాస్, బియ్యని శివకుమార్, వనం రాంచందర్‌రావు, దాసరి చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

కేటీఆర్ రాజీనామా వ్యక్తిగతం

తమ ప్రభుత్వం రూ.రెండు లక్షల రుణమాఫీ చేస్తే ఎమ్మెల్యే, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ పదువులకు రాజీనామా చేస్తానని కేటీఆర్ పేర్కొనడం తన వ్యక్తిగతమని మంత్రి అన్నారు. ఎవరో రాజీనామా చేస్తామని వ్యాఖ్యానిస్తే.. అది కాంగ్రెస్ ప్రభుత్వ ఎజెండా కాదని, ప్రజాసంక్షేమమే తమ ప్రభుత్వ ఎజెండా అని పేర్కొన్నారు.

కుల బహిష్కరణపై విచారణ చేపట్టండి

- పోలీసులను ఆశ్రయించిన బాధితులు

ముస్తాబాద్(సిరిసిల్ల): పోతుగల్‌లో గౌడ సంఘం పెద్దలు తమను కులబహిష్కరణ చేశారని బాధితులు ఎస్సై గణేశ్‌కు ఆదివారం ఫిర్యాదు చేశారు. గత అక్టోబర్‌లో కల్లు దుకాణాల నిర్వహణలో రెండు గ్రూపులుగా గీత కార్మికులు విడిపోయారని, కొద్ది రోజుల క్రితం 14 కుటుంబాలను వెలివేస్తూ తీర్మానించారని బాధితులు బత్తిని అంజయ్య, జిల్లెల్ల రాజయ్య, మల్లేశం, బాలయ్య, బాలకిష్టయ్య, శ్రీనివాస్ ఫిర్యాదు చేశారు. తమతో ఎవరు మాట్లాడినా రూ.11వేలు జరిమానా విధిస్తామనే నిబంధన విధించారన్నారు. శుభకార్యాలకు పిలవడం లేదని, అంతిమ సంస్కారాలకు రానివ్వడం లేదన్నారు. విచారణ చేసి, తమకు న్యాయం చేయాలని ఎస్సైని కోరారు.

రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో ప్రతిభ


కప్ అందుకుంటున్న విద్యార్థులు

మల్యాల: మల్యాల మండలం తాటిపల్లి బాలికల గురుకులం కళాశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో ప్రతిభ కనబరిచారు. కరాటే కుంగ్‌ఫూ చాంపియన్‌షిప్ రాష్ట్రస్థాయి పోటీల్లో గురుకులం విద్యార్థులు ప్రథమ స్థానంలో కమలిని, ఎస్.అశ్విత, కె.శ్రీచందన, బి.శ్రీవర్షిణి, ద్వితీయ స్థానంలో జె.గీతిక, వి.హన్సిక, రిత్విక్‌శ్రీ, తృతీయ స్థానంలో ఎ.ప్రకృతి, కె.ప్రణీత,సింధూజ, శ్రీనిధి, పి.వైష్ణవి పతకాలు సాధించారు.

గంజాయి తరలిస్తున్న వ్యక్తి అరెస్టు


నిందితుడి అరెస్టు చూపుతున్న పోలీసులు

సారంగాపూర్: మండలంలోని రేచపల్లి నుంచి జగిత్యాలకు గంజాయి తరలిస్తున్న ఓ వ్యక్తిని పోలీసులు ఆదివారం అదుపులోకి తీసుకున్నారు. అతడి నుంచి గంజాయిని స్వాధీనం చేసుకుని అరెస్టు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. రేచపల్లికి చెందిన జిన్న రాజేశం అలియాస్ సిద్ధు ద్విచక్రవాహనంపై జగిత్యాలకు గంజాయిని తీసుకెళ్తున్నాడు. పక్కా సమాచారంతో పోలీసులు రేచపల్లి క్రాస్‌రోడ్డు వద్ద రాజేశంను పట్టుకున్నారు. గంజాయితోపాటు సెల్‌ఫోన్, ద్విచక్రవాహనం స్వాధీనం చేసుకున్నారు. గతంలో సారంగాపూర్ పోలీస్‌స్టేషన్‌లో పోలీసులు నిల్వ ఉంచిన గంజాయిని దొంగిలించిన నిందితుల్లో రాజేశం ఒకరు. ఆ కేసులో రాజేశంతోపాటు నిందితులను అరెస్టు చేశారు. జైలు నుంచి బయటకు వచ్చి ముంబయి ప్రాంతానికి వెళ్లి కూలీ పనులు చేస్తూ గంజాయికి అలవాటుపడ్డాడు. అక్కడ గుర్తు తెలియని వ్యక్తుల నుంచి గంజాయి కొంటూ ఎక్కువ ధరకు అమ్ముతున్నాడు. ఇటీవల 1200 గ్రాముల గంజాయి కొని రేచపల్లికి తీసుకొచ్చాడు. చుట్టుపక్కల గ్రామాలకు తరలిస్తుండగా పట్టుకున్నారు. అతడి నుంచి 1050 గ్రాముల గంజాయి, ద్విచక్ర వాహనం, ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

జేఎన్టీయూలో టెండర్లు ఎప్పుడో..?

- ఆరేళ్లుగా నిలిచిపోయిన ప్రక్రియ
- చివరగా 2018లో నిర్వహణ
- వర్సిటీ ఆదాయానికి గండి


నాచుపెల్లి జేఎన్టీయూ క్యాంటీన్

కొండగట్టు(చొప్పదండి): జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలం నాచుపల్లి వద్దగల జేఎన్టీయూ ఇంజినీరింగ్ కళాశాల క్యాంటీన్, జనరల్ స్టోర్‌కు ఆరేళ్లుగా టెండర్ నిర్వహించడం లేదు. ప్రస్తుతం ఉన్న ధరకంటే అధిక ధర చెల్లిస్తామని కొత్త టెండర్‌దారులు ముందుకొస్తున్నా.. వర్సిటీ అధికారులు మాత్రం వెనుకడుగు వేస్తున్నారు. టెండర్లు నిర్వహించకపోవడంతో కళాశాలకు వచ్చే ఆదాయానికి భారీగా గండిపడుతోంది. 2018లో చివరిసారిగా క్యాంటీన్, జనరల్ స్టోర్‌కు టెండర్ నిర్వహించారు. ఆ సమయంలో ఏడాది కాలపరిమితికి గాను క్యాంటీన్ నిర్వహణకు రూ.1.86లక్షలు, జనరల్ స్టోర్ నిర్వహణకు రూ.84వేలకు టెండర్ దక్కించుకున్నారు. ఏడాది గడువు పూర్తయిన వెంటనే తిరిగి టెండర్ నిర్వహించాల్సిన అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. గడువు ముగిసినప్పటినుంచి క్యాంటీన్‌కు నెలకు రూ.15వేలు, జనరల్ స్టోర్‌కు రూ.7వేల చొప్పున డబ్బులు తీసుకుంటూ.. రెండు నెలలకు గడువు పెంచుతూ పాతవారినే కొనసాగిస్తున్నారు. ఇవే టెండర్లు ఏటా 15శాతం పెరిగినా.. ఇప్పటికి క్యాంటీన్‌కు సుమారు రూ.3లక్షలు, జనరల్ స్టోర్‌కు రూ.2లక్షలు పలికేదని టెండర్‌దారులు అంటున్నారు. గతంలో ఉన్న ధరలకంటే అదనంగా 10శాతం అధికంగా చెల్లిస్తామని కొందరు టెండర్‌దారులు కళాశాల యాజమాన్యానికి వినతిపత్రం అందించినా టెండర్ పిలవకపోవడం అనుమానాలకు తావిస్తోంది.

ఇష్టానుసారంగా ధరలు

విద్యార్థుల అవసరాలను ఆసరా చేసుకున్న టెండర్‌దారులు.. అటు క్యాంటీన్‌లో.. ఇటు జనరల్ స్టోర్‌లో ధరల పట్టిక ఏర్పాటు చేయకుండా అధిక ధరలు వసూలు చేస్తున్నట్లు సమాచారం. వాస్తవానికి కళాశాలలో విధులు నిర్వర్తించే ఎవరైనా టెండర్‌లో పాల్గొనకూడదు. బినామీల పేరున కూడా దుకాణాలు నడపడం నిబంధనలకు విరుద్ధం. కానీ.. ఇక్కడ మాత్రం ఏకంగా ఓ ఉద్యోగే దుకాణాలు నడిపిస్తున్నారు. తన వ్యక్తిగత వ్యాపారానికే ప్రాధాన్యం ఇస్తున్నట్లు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇదంతా సంబంధిత శాఖ అధికారుల కళ్లముందు జరుగుతున్నా.. ఎలాంటి చర్యలూ చేపట్టడం లేదు.

ఫ్రూట్స్ విక్రయాలకూ లేని టెండర్

విద్యార్థులకు నిత్యం వివిధ రకాల పండ్లు అవసరం ఉంటాయి. అలాగే జిరాక్స్, వివిధ రకాల ఆన్‌లైన్ సర్వీసుల సేవలు తప్పనిసరి. విద్యార్థులకు ఏం కావాలన్న అయితే కొడిమ్యాల.. లేకుంటే జగిత్యాల వెళ్లాల్సి వస్తోంది. అదే టెండర్ నిర్వహించినట్లయితే అటు కళాశాలకు ఆదాయంతోపాటు విద్యార్థులకు సౌకర్యం కల్పించినట్లవుతుందన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఇదే విషయంపై వివరణ కోరేందుకు జేఎన్టీయూ సీఈ వెంకటేశ్వర్ రెడ్డిని ఫోన్‌లో సంప్రదించగా అందుబాటులోకి రాలేదు.

టెండర్లు నిర్వహించండి



యూనివర్సిటీ అధికారులు ఆరేళ్లుగా టెండర్ నిర్వహించడం లేదు. కళాశాలకు వచ్చే ఆదాయానికి గండి పడుతోంది. మరోవైపు విద్యార్థులు కూడా నష్టపోతున్నారు. అధికారులు స్పందించి వెంటనే టెండర్లు పిలిస్తే కళాశాలకు ఆదాయం రావడంతోపాటు విద్యార్థులకు అన్ని సౌకర్యాలు అందుతాయి.

– తాళ్ళపెల్లి అంజయ్యగౌడ్, నాచుపెల్లి